క్లుప్తంగా

నేడు మండల సమావేశం

పామూరు: మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.శ్రీనివాసులు తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఆలయ పునఃనిర్మాణానికి విరాళం

కందుకూరు అర్బన్: అంకమ్మతల్లి ఆలయ పునఃనిర్మాణానికి దాతలు విరాళాలు అందజేస్తున్నారు. లింగసముద్రం మండలం బలిజపాలెం గ్రామానికి చెందిన హనుమంతరావు, లక్ష్మి కామేశ్వరి దంపతులు, మధుసూదరావు, వెంకటస్వర్ణలత దంపతులు రూ.25,116 నగదును అందజేశారు. కమిటీ సభ్యుడు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రమేష్

గుడ్లూరు: ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డీటీ రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న లావణ్యను కలెక్టర్ సస్పెండ్ చేశారు. దీంతో డీటీగా విధులు నిర్వర్తిస్తున్న రమేష్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు రావడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని పొడిగించాలి

ఉలవపాడు: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని మరో పదేళ్ల పాటు పొడిగించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్‌నగర్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీని సమావేశపరిచి అధికార ప్రతిపక్షాలు ఏకగ్రీవంగా తీర్మానం చేయాలని కోరారు. వెనుకబడిన కులాలకు ప్రత్యేక నిధులు కేటాయించి వాటిని వారికే ఉపయోగించాలన్నారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, తానికొండ ఆనంద్, వేలూరి శ్రీనివాసరావు, ఎద్దు రామారావు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆధార్ మొబైల్ సేవలు

హనుమంతునిపాడు: మండలంలోని 14 గ్రామ సచివాలయాల్లో ఈ నెల 23 నుంచి 24 వరకు ఆధార్ మొబైల్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ జీవీ. కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాల్లో 5 నుంచి 15 ఏళ్లలోపు వారికి ఆధార్ కార్డు నమోదు, చిరునామా, ఫొటో మార్పు, తప్పుల సవరణలు చేసుకోవచ్చన్నారు. ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వలేటివారిపాలెం: మండలంలోని సచివాలయాల్లో ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ రఫీక్ అహ్మద్ తెలిపారు. 19, 20, 21 తేదీల్లో వలేటివారిపాలెం సచివాలయంలో, 23, 24 తేదీల్లో పోకూరు సచివాలయంలో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఎవరికి వారే యమునా తీరే..

- మూడు ముక్కలాటలా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం
- ఇదేం ఖర్మ అంటున్న కార్యకర్తలు

ఉలవపాడు: వారంతా ఒకే పార్టీ నాయకులు.. కానీ ఒకరంటే ఒకరికి పడదు. ఈ సమయంలో వచ్చిన ఎన్టీఆర్ వర్ధంతి వారిలో విభేధాలు మరోసారి బయటపడ్డాయి. దీంతో కార్యకర్తలు ఎవరితో మాట్లాడితే ఎవరు ఏమనుకుంటారో అని ఆందోళన పడిన పరిస్థితి మండల పరిధిలో జరిగింది. బుధవారం కరేడులో ఎన్టీఆర్ వర్ధంతి సభ నిర్వహించారు. ఇందులో టికెట్ ఆశిస్తున్న ముగ్గురు నాయకులు వారి వారి అనుచరగణంతో వేర్వేరుగా హాజరై తమ విబేధాలను అందరికీ చూపించారు. ప్రస్తుత పార్టీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాంతో కలిసి వర్ధంతిలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు తన అనుచరులతో కలిసి అదే కార్యక్రమానికి హాజరయ్యారు. నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ తరువాత తన వర్గంతో అదే గ్రామంలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ముగ్గురు వేర్వేరుగా తమ అనుచరులతో హాజరుకావడంతో టీడీపీలో ఉన్న విబేధాలు ఎన్టీఆర్ వర్ధంతి సాక్షిగా మరోసారి బహిర్గతం అయ్యాయి. అసలే పార్టీ ఇబ్బందుల్లో ఉంటే వీరి గోల ఏంటి అని కార్యకర్తలు అంటున్నారు.

వైభవంగా నాంది ప్రస్తాపన

సీఎస్‌పురం: వెంకటేశ్వరస్వామి, షిర్డీ సాయిబాబా ఆలయాల నిర్మాణానికి నాంది ప్రస్తాపన కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కావలి నియోజక వర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు తన స్వంత నిధులతో వెంకటేశ్వర స్వామి, షిరిడీ సాయిబాబా ఆలయాలు నిర్మించ తలపెట్టారు. ఈ ఆలయాల నిర్మాణానికి ఈ నెల 27 భూమిపూజ చేయనున్నారు. సీఎస్‌పురం కోవిలంపాడు గ్రామాలకు మధ్యలో మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి సమీపంలో భూమిని చదును చేసి నాంది ప్రస్తాపన చేపట్టారు. ఆలయాల నిర్మాణం చేపట్టనున్న ప్రదేశంలో వేద పండితులు శ్రీధర్ శర్మ ఏరువాక శాస్త్రోక్తంగా నిర్వహించారు. కోవిలంపాడు ఉప సర్పంచ్ తీకెనం బాబూరావు, మాజీ ఎంపీటీసీ మునగల వెంకటనారాయణరెడ్డి, పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి
- ప్రతి గడపలో పూలతో స్వాగతం పలికిన ప్రజలు


లబ్ధిదారులు పొందిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

కందుకూరు రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జి.మేకపాడులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. బజారు ముఖద్వారాల్లో వెల్‌కామ్ ఎమ్మెల్యే సార్ అంటూ మహిళలు, చిన్నారులు పూలు చల్లుతూ గులాబీలు ఇచ్చి స్వాగతం పలికారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందాయా లేదా... అని తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రతి గడపకు వెళ్లి తెలుసుకోవాలని తెలిపారని చెప్పారు. లబ్ధిదారులకు అందిన సంక్షేమ ఫలాలను వివరించారు. ఈ పథకాలు అందాయా లేదా.. ఇంకేమైన పథకాలకు అర్హత ఉండి దరఖాస్తు చేసుకొని రానివి ఏమైనా ఉంటే తెలియజేయాలన్నారు. కొందరు పొదుపు గ్రూపుల్లో లేనట్లు గుర్తించి ఆ మహిళలు పొదుపు గ్రూపుల్లో ఎందుకు చేరలేదని అడిగి గ్రూపుల్లో ఉండడం వల్ల వచ్చే లాభాలను వివరించారు. గ్రూపుల్లో లేకపోవడం వల్ల ఎలా నష్టపోతున్నారో వివరించారు. పనులపై ఎక్కడికైనా వెళ్లినప్పటికీ తిరిగి గ్రామాలకే వస్తారు కాబట్టి పొదుపు కట్టుకొని రుణాలు పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. భూ సమస్యలపై కొందరు తెలియజేయగా వాటిపై రెవెన్యూ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలియజేశారు. అనంతరం వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. వైఎస్సార్ క్రాంతి పథంలోని వీఓఏలు, సీసీలు తమ పనితీరు మార్చుకోవాలన్నారు. మహిళలను పొదుపు గ్రూపుల్లో చేర్పించడంతో, రుణాలు మంజూరు చేయించడంలో నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. ప్రతి నెలా ఏర్పాటు చేసుకునే సమావేశాలకు కచ్చితంగా మీరు హాజరై వారికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ కూడా గ్రామంపై తగ్గిందన్నారు. సచివాలయ ఉద్యోగులు వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. సచివాలయ ఉద్యోగులు కార్యాలయంలో కేవలం మూడు గంటలు మాత్రమే ఉండాలన్నారు. మిగిలిన సమయం అంతా గ్రామంలో తిరిగి రోజుకి కనీసం 15 గృహాలనైనా పరిశీలించి వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. సచివాలయాలకు వివిధ సర్టిఫికెట్లపై వచ్చిన ప్రజలకు తెలియకపోయినా దానికి సంబంధించిన వివిధ రకాల ఆధారాలను తీసుకొని రమ్మని వారికి తెలియజేసి ఆ పని పూర్తయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. సమస్యలపై వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరించి సమస్యను తెలుసుకోవాలన్నారు. ఎంపీపీ ఇంటూరి సుశీల, జెడ్పీటీసీ తొట్టెంపూడి అనసూర్య, ఎంపీడీఓ పి.విజయశేఖర్, సర్పంచ్ జి.బ్రహ్మయ్య, మాజీ సర్పంచ్ నాగేశ్వరరెడ్డి, రూరల్ ఎస్సై శివనాంచారయ్య, సర్పంచ్‌లు కుమ్మర బ్రహ్మయ్య, ఆవుల మాధవరావు, వి.శ్రీను, ఎం.రామారావు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం


చినకండ్లగుంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న వరికూటి అశోక్‌బాబు

కొండపి: రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన చేస్తుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని చినకండ్లగుంట పంచాయతీలోని తాటాకులపాలెం, చినకండ్లగుంట గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు తిరుగుతూ ప్రభుత్వం నుంచి వచ్చిన లబ్ధిని వివరించారు. అదే విధంగా గ్రామాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతు దేశం మన రాష్ట్రం వైపు చూసేలా పథకాలను ప్రజలకు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. మన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కోవిడ్ కష్ట కాలంలో సైతం ప్రజలకు ఇబ్బందిలేకుండా వైద్యం అందించిన ఘనత ఏపీకే దక్కిందన్నారు. ప్రతికూల పరిస్థితులు, ఆర్థిక సమస్యలను సైతం ఎదుర్కొంటూ పేద బడుగు బలహీన వర్గాలకు అండగా ఉన్న సీఎం జగనన్న ఒక్కరే అన్నారు.

ప్రతిపక్షాలు ప్రజలకు ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పిన నమ్మే పరిస్థితి లేదన్నారు. గతంలో చంద్రబాబు చేసిన అవినీతి పాలన ప్రజలకు ఇప్పటికీ కళ్లకు కట్టినట్లు కనిపిస్తుందన్నారు. నియోజకవర్గంలోనే అభివృద్ధి పనుల మాటున ఎమ్మెల్యే స్వామి, అతని అనుచరులు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేశారన్నారు. చివరికీ పేదల మరుగుదొడ్ల డబ్బును సైతం లూటీ చేసిన ఘనత టీడీపీ పార్టీ నాయకులకు దక్కిందన్నారు. ప్రజలకు అన్నీ తెలిసే వచ్చే ఎన్నికల్లో ఓటు వైఎస్సార్ సీపీకి వేయటానికి జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. చినకండ్లగుంట గ్రామానికి వచ్చిన అశోక్‌బాబుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ వన్నూరు సాహెబ్, స్థానిక నాయకులు పరసా తిరుపతి స్వామి, కోటేశ్వరరావు, ముద్రగడ శ్రీను, పుట్టా ఏడుకొండలు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ పెన్నా క్రిష్ణయ్య

లింగసముద్రం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని యాదవ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో గోకులకృష్ణ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. బుధవారం జరిగిన ఫైనల్స్‌లో జంపాలవారిపాలెంకు చెందిన ఈవీ లెవన్స్ జట్టు విజయం సాధించింది. మొదటి బహుమతి రూ.15,116 పెన్నా గురవయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఎంపీపీ పెన్నా క్రిష్ణయ్య, రమణయ్య, రమేష్ విజేతలకు అందజేశారు. ద్వితీయ బహుమతి రూ.10116 బచ్చు క్రిష్ణయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు బచ్చు మధు, మాల్యాద్రి, కొండలరావు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉత్సాహబరితంగా జరిగిన ఈ క్రికెట్ పోటీలు క్రీడాకారులకు ఎంతో ఉత్సాహాన్ని నింపాయని, రానున్న రోజుల్లో యాదవ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ మేకనబోయిన శ్రీనివాసులు, సర్పంచ్ డబ్బుగొట్టు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్..కారు ఢీ

- నలుగురికి గాయాలు

ముండ్లమూరు: మండలంలోని పెద ఉల్లగల్లు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. విజయవాడ నుంచి పొద్దుటూరు వెళ్తున్న కారు దర్శి–అద్దంకి ప్రధాన రహదారిలో పెద ఉల్లగల్లు వద్ద పొలం నుంచి రోడ్డుపైకి వస్తున్న ట్రాక్టర్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఎస్.రామయ్య, సుబ్బారెడ్డిలకు, ట్రాక్టర్‌పై ఉన్న జిల్లెలమూడి వెంకటేశ్వర్లు, రమణమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

క్రికెట్ టోర్నీ విజేత కె.అగ్రహారం జట్టు


విజేతగా నిలిచిన అగ్రహారం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నాయకులు

పొన్నలూరు: మండలంలోని కె.అగ్రహారం గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని గ్రామ యూత్ ఆధ్వర్యంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీలో కె.అగ్రహారం జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో పలు మండలాల నుంచి మొత్తం 32 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో కె.అగ్రహారం సీనియర్, జూనియర్ జట్లు తలపడగా జూనియర్ జట్టు గెలుపొందింది. విజేతగా నిలిచిన జట్టుకు రూ.15,116, రనరప్ జట్టుకు రూ.7,116 నగదుతోపాటు ట్రోఫీని మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే రసూల్, వైఎస్సార్ సీపీ నాయకులు వంగపాటి రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ ట్రోఫీ, క్రీడాకారులకు మెడల్స్‌ను ఆర్‌ఎంపీ డాక్టర్ భాస్కర్‌రావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ద్రోణాదుల కిషోర్ అందజేశారు. కార్యక్రమంలో డీలర్ ముత్తంగి మహేష్, కొడాలి రోశయ్య, నిర్వాహకులు, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెండి తాపడం తయారీకి విరాళం


రూ. 1,00,116 విరాళం విరాళం అందిస్తున్న దాసరి దుర్గాప్రసాద్, తిరుమహాలక్ష్మి దంపతులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయంలోని అంకమ్మ ఉపాలయ గోపురం వెండి తాపడం తయారీకి ప్రకాశం జిల్లా, సింగరాయకొండ గ్రామానికి చెందిన దాసరి దుర్గాప్రసాద్, తిరుమహాలక్ష్మి దంపతులు బుధవారం రూ. 1,00,116 విరాళం ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్లు బి.కృష్ణమోహన్, జంగం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. నందిగామ పట్టణానికి చెందిన మాజేటి అనిల్‌కుమార్, నళిని దంపతులు కూడా గోపురం వెండి తాపడం తయారీకి రూ. 10,116 విరాళం అందించారు.

పనులకు తక్షణం బిల్లుల మంజూరు


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ శీనారెడ్డి

పీసీపల్లి: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేస్తున్న పనులకు బిల్లులు త్వరితగతిన మంజూరు చేస్తున్నట్లు డ్వామా పీడీ కె.శీనారెడ్డి తెలిపారు. మండలంలోని నేరేడుపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ శీనారెడ్డి కూలీలతో సమావేశమై కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉపాధి పనులను నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కూలీలకు కనీసవేతనం రూ.257 రావాలంటే ప్రభుత్వం ఇచ్చిన కొలతల ప్రకారం కనీసం రోజుకు 4 గంటలు పనిచేయాల్సి ఉంటుందని కూలీలకు వివరించారు. చేసిన పనులకు వెంటనే బిల్లులు మంజూరుచేస్తామని జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు చేసుకోవాలని తద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. వచ్చే వేసవి నాటికి పనిప్రదేశంలో కూలీలకు ఎటువంటి ఇబ్బందులు కలగకూండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రాంబాబు, టీఏలు, ఉపాది సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్‌షెడ్‌లతో భూగర్భ జలాల పెంపు


మైక్రో వాటర్‌షెడ్ పనులు ప్రారంభిస్తున్న డ్వామా పీడీ శీనారెడ్డి

పీసీపల్లి: వాటర్ షెడ్ల ఏర్పాటుతో భూగర్భ జాలాలు పెంపొందించవచ్చని డ్వామా పీడీ కె.శీనారెడ్డి అన్నారు. మార్వెల్ల ప్రాజెక్ట్‌లో భాగంగా మండలంలోని మురుగమ్మిలో మైక్రోవాటర్‌షెడ్ పనులను బుధవారం ఆయన ప్రారంభించారిఉ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి రూ.7.79 కోట్ల విలువైన 7 ప్రాజెక్టులు మంజూరయ్యాయన్నారు. ఇందులో భాగంగా మురగమ్మిలో మైక్రో వాటర్‌షెడ్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. నీటిని సంరక్షించడం, భూసారాన్ని పెంపొందించడం, పచ్చదనాన్ని పెంపొందించడం, నీటిని నిల్వ ఉంచడం వీటి ప్రధాన లక్ష్యమన్నారు. తద్వారా వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ఎంతో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, ఓకే రెడ్డి, సర్పంచ్ వెంకట్రావు, సుబ్బరత్తమ్మ, రాజేష్‌కుమార్, ఖాదర్‌బాషా, శ్రీనివాసులు, కోటిరెడ్డి పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి రూ.5 వేల విరాళం


పీహెచ్‌సీలో నగదు అందజేస్తున్న జేవీవీ నేతలు

గుడ్లూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, రోగుల కోసం నూతనంగా నిర్మిస్తున్న సమావేశ, వెయిటింగ్ హాలుకు మండల జనవిజ్ఞాన వేదిక నాయకులు, వైద్యాధికారి సాయి ప్రసన్నకు బుధవారం రూ.5వేలను విరాళంగా అందచేశారు. వైద్య సిబ్బంది, రోగుల సౌకర్యార్థం జన విజ్ఞాన వేదిక వారు ముందుకు వచ్చి విరాళం అందచేయడం అభినందనీయమని డాక్టర్ సాయి ప్రసన్న తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు శరత్, ఆంజనేయులు, రమేష్ పాల్గొన్నారు.

63 మందికి వైద్య పరీక్షలు


దాసళ్లపల్లిలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ప్రతాప్‌రెడ్డి

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా బుధవారం దాపళ్లపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 63 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ సందీప్ సలహాలు సూచనలు చేశారు. డాక్టర్ ప్రతాపరెడ్డి, వైద్య సిబ్బంది, 104 వాహన వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఫిబ్రవరి చివర్లో వేలం ప్రారంభించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రైతు ప్రతినిధులు

కందుకూరు: పొగాకు వేలం వచ్చే నెలాఖరు లేదా మార్చి మొదటి వారంకల్లా ప్రారంభించాలని రైతులు అధికారులకు సూచించారు. స్థానిక పామూరు రోడ్డులోని రెండో వేలం కేంద్రంలో బుధవారం రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ వేలం ప్రారంభంపై రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. రైతులకు సూచించిన విధంగా అధికారులతో చర్చించి వేలం ప్రారంభిస్తామని చెప్పారు. రైతుల ప్రతినిధులు మాట్లాడుతూ వేలం కచ్చితంగా ఫిబ్రవరిలో చివరి వారంలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని, కుదరకుంటే మార్చి మొదటి వారంలో ప్రారంభించాలని కోరారు. అలాగే వేలం ప్రారంభం నుంచే ఇండెంట్లు ఇచ్చిన కంపెనీలన్నీ వేలంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నీ కంపెనీలు వేలంలో పాల్గొంటే మంచి ధరలు వచ్చే అవకాశం ఉందన్నారు. అధికారులు రైతులకు సౌలభ్యంగా ఉండేలా అధికారులు, బోర్డు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే బేల్ పట్టాలు రైతులకు గురువారం నుంచి పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పట్టాలు కావాల్సిన రైతులు పొగాకు బోర్డు పాసుపుస్తం తీసుకుని వేలం కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. ఫీల్డ్ ఆఫీసర్ శ్రీరాజహర్ష, రైతు సంఘం అధ్యక్షుడు మాదాల రమణయ్య, కార్యదర్శి వడ్లమూడి రామకృష్ణ, బ్రహ్మయ్య, మాదవ, రవీంద్ర పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

టంగుటూరు: రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీ పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షల సందర్భంగా ఈ నెల 22న పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై ఖాదర్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వల్లూరు గ్రామ పరిధిలోని రైజ్, పేస్ ఇంజినీరిగ్ కాలేజీల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కేంద్రాల నుంచి సుమారు 200 మీటర్ల దూరంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు.

భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు అర్బన్: జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్‌ను స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కందుకూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి షేక్. మహమ్మద్‌రఫీ, రూరల్ ఎస్సై ఎం. శివనాంచారయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పిరమిడ్ అద్భుత శక్తి


శాఖాహార ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యాన సాధకులు

కొండపి: ప్రకృతిలో సహజంగా ఉండే విశ్వమయ ప్రాణశక్తి పిరమిడ్‌లో ఇమిడి ఉంటుందని వైకుంఠ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యురాలు శిద్దా జయశ్రీ పేర్కొన్నారు. మండలంలోని మిట్టపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ధ్యానంతో అద్భుత ఫలితాలు పొందుతారని తెలిపారు. ప్రతి ఆదివారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు నూతనంగా ప్రారంభించిన పిరమిడ్‌లో ధ్యానం చేసుకోవచ్చన్నారు. ముందుగా శాఖాహారం–ఆరోగ్య ప్రయోజనాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పిరమిడ్ ధ్యాన సాధకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

కందుకూరు అర్బన్: మండల పరిధిలోని ఓగూరు గ్రామానికి చెందిన మద్దెల మల్లికార్జున, మద్దెల పోలేశ్వరీలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు చీమల రాజా పాల్గొన్నారు.

ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

కంభం: స్థానిక సర్కిల్ పరిధిలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని షెడ్యూల్డు కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు ఎస్పీ మలికాగర్గ్‌ను కోరారు. సోమవారం కంభం పోలీసుస్టేషన్‌ను సందర్శించిన ఎస్పీని ఆయన శాలువాతో సన్మానించి అంబేడ్కర్ డైరీ, క్యాలెండర్‌ను అందజేశారు. ఈ ప్రాంతంలో ఫ్యామిలీ గొడవలు ఎక్కువగా జరుగుతున్నాయని, స్టేషన్‌కు వచ్చిన వారిని డిపార్టుమెంట్ ద్వారా కౌన్సిలింగ్ ఇస్తే వారు కలిసి జీవించే వీలుంటుందన్నారు. అటువంటి వారి కోసం ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్పీకి ఆయన వినతి పత్రం అందజేశారు.